క్లుప్తంగా

బ్యాటరీ ట్రైసైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న రమణరాజు

మెరకముడిదాం: రామాయవలస గ్రామానికి చెందిన దివ్యాంగుడు మతికాన అప్పలనాయుడుకు జిల్లా పరిషత్ నిధులతో సమకూర్చిన బ్యాటరీ ట్రైసైకిల్‌ను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు సోమవారం సోమలింగాపురంలో అందజేశారు. ట్రైసైకిల్‌ను మంజూరు చేసిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు దివ్యాంగుడు కృతజ్ఞతలు తెలిపారు. రామాయవలస ఎంపీటీసీ సన్యాసినాయుడు, నాయకులు జమ్ము రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు



పోటీల్లో పరుగు తీస్తున్న ఎద్దులు

వేపాడ: మండల కేంద్రంలో గ్రామదేవతల తీర్థం సందర్భంగా సోమవారం నిర్వహిం చిన ఎడ్ల పరుగు పందెం పోటీలు ఉత్సాహంగా సాగాయి.విజయనగరం,అనకాపల్లి జిల్లాలకు చెందిన 13జతల ఎద్దులు ఈపోటీల్లో పాల్గొన్నాయి. వరుస అయిదు స్థానాల్లో నిలిచిన ఎడ్ల బళ్లకు చెందిన యజమానులకు కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

హ్యాండ్ బోర్ల ప్రారంభం



వి.ఆర్.పాలెంలో హ్యాండ్ బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ అరుణ, తదితరులు

జామి: వి.ఆర్.పాలెం,సోమయాజులపాలెం గ్రామాల్లో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు హ్యాండ్ బోర్లను ఎంపీపీ సబ్బవరపు అరుణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో మండలంలో ఇప్పటివరకు 20 బోర్లు వేశామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్,రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, ఎంపీటీసీ ఆర్.సత్యం,వి.ఆర్.పాలెం, శాశనపల్లి, జన్నివలస గ్రామాల సర్పంచ్‌లు సీహెచ్. లక్ష్మి, వెంకటఅప్పారావు, చందునాయుడు, నాయకుడు రవికుమార్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

వేపాడ: మండల కేంద్రంలో పరదేశమ్మ తీర్థం సందర్భంగా మహిళలకు జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు సోమవారం నిర్వహించారు. జిల్లాలోనా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 102 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రామాలయం వీధి నుంచి ,ఆదపురెడ్డి వీధి, చీపురుపల్లి వీధుల్లో మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. న్యాయ నిర్ణేతలుగా గుమ్మడి భారతి, నిరుజోగి ముత్యాలమ్మ, బోజంకి మాధవి, రంభ అమ్మాజీ,శ్రావణి వ్యవహరించారు. విజేతకు గ్రాము బంగారం, ద్వితీయ స్థానంలో నిలిచిన మహిళకు 50 గ్రాముల వెండి, తర్వాత స్థానాల్లో నిలిచిన ఐదుగురు మహిళలకు 25 గ్రాముల చొప్పున వెండి, 10 మందికి ఇత్తడి బిందెలు, మరో పది మందికి చీరలను బహుమతులుగా ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామపెద్దలు అందజేశారు.

నేడు గుర్లలో ఆసరా సంబరాలు



సభా స్థలంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గుర్ల మండల స్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సోమవారం తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు అతిథులుగా హాజరవుతారని చెప్పారు. మండలం లో ఆసరా లబ్ధిదారులు అంతా హాజరు కావాలని కోరారు. సభా స్థలం వద్ద ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ నాయకులు కె.వి. సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు , జమ్ము స్వామినాయుడు , కెంగువ మధుసూదనరావు పరిశీలించారు.

వాలీబాల్ పోటీల ప్రారంభం

గజపతినగరం: మండల కేంద్రంలో 'ఆడుదాం-ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి పురుషుల వాలీబాల్ పోటీలను జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహిండ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. పీఈటీ సత్యనారాయణ, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అధికారి పి.సుదర్శనం, నాయకులు కోరాడ మోహన్,పప్పల గురునాయుడు, కర్రి లక్ష్మణ, కర్రికృష్ణ పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేశాం..

- ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబుని మించిన వారు లేరు
- టీడీపీ హయాంలో దోపిడీ జరిగితే.. జగన్ హయాంలో పేదలు బాగుపడ్డారు
- అప్పుడు, ఇప్పుడు రాష్ట్రంలో అదే బడ్జెట్
- మంచి చేశాం కాబట్టే సీఎం జగన్ ధైర్యంగా ఓటు అడుగుతున్నారు
- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో మంత్రి బొత్స సత్యనారాయణ



డ్వాక్రా సంఘాల సభ్యులకు ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ



ఆసరా సభకు హాజరైన మహిళలు

చీపురుపల్లి: రాజకీయాలు అంటే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మాదిరిగా ప్రజలను మోసం , దగా చేయడం కాదని, ఇచ్చిన మాటపై నిలబడి ప్రజల కష్టాలు తీర్చడమని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన పాలన ద్వారా చాటి చెప్పారని రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చీపురుపల్లి మండల స్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు సోమవారం నిర్వహించారు. అతిథిగా హాజరైన మంత్రి బొత్స ముందుగా దివంగత ముఖ్యమంత్రి, మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద జ్యోతి వెలిగించి, పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తామని టీడీపీ అధి నేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీ చేయకుండా మహిళలను మోసం చేశారని గుర్తు చేశారు. 2019 ఏప్రిల్ నాటికి రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల్లో ఉన్న అప్పును నాలుగు విడతల్లో చెల్లిస్తామని 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, మాట ప్రకారం ఇప్పటికే మూడు విడ తల్లో మహిళల ఖాతాల్లో డబ్బులు జమచేశామని, ప్రస్తుతం నాలుగో విడత జమచేశామని చెప్పారు.

టీడీపీ హయాంలో చేసిన అప్పులతో ఏం చేశారు..?

రాష్ట్రంలో పారదర్శక సంక్షేమ పాలన సాగుతోందని, చరిత్రలో ఏ ప్రభుత్వం అమలు చేయనన్ని పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారని మంత్రి బొత్స అన్నారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని పిల్లలను బడి కి పంపించే తల్లులకు జగనన్న అమ్మఒడి పథకంలో భాగంగా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం ద్వారా జిల్లాలో ప్రతీ ఏడాది రూ.135 కోట్లు తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా చీపురుపల్లి మండలంలోని లబ్ధిదారుల ఖాతాల్లో ఫిబ్రవరి 7న రూ.7 కోట్లు జమచేయనున్నామని పేర్కొన్నారు. పథకాల ద్వారా వేల కోట్ల రూపాయలను ప్రజలకు అందిస్తున్నామని, ఎక్కడైనా ఒక్క రూపాయి అవినీతి జరిగిందా, లబ్ధిదారులను ఎవరైనా లంచం అడిగారా అని ప్రశ్నించారు. గత టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాల్లో సైతం అవినీతి, లంచాలు రాజ్యమేలాయన్నారు. ప్రభుత్వం అప్పులు చేస్తోందని ప్రతిపక్షాలు అంటున్నాయని, చరిత్రలో అప్పు చేయని ప్రభుత్వం ఏదైనా ఉంటే చూపించాలని సవాల్ చేశారు. టీడీపీ హయాంలో తెచ్చిన అప్పులతో ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. అప్పుడు, ఇప్పుడు ఒకటే బడ్జెట్ ఉన్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వంలో పేదల అభ్యున్నతి జరిగిందని, గత ప్రభుత్వంలో పెత్తందారుల అభివృద్ధి జరిగిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎందుకు ఇలాంటి పథకాలు అమలు చేయ లేదో చెప్పాలని గ్రామాల్లోకి వచ్చే ఆ పార్టీ నాయకులను నిలదీయాలని మహిళలకు సూచించారు. ఈ ప్రభుత్వంలో మేలు జరిగితేనే ఓటు వేయండి లేకపోతే వద్దు అని ధైర్యంగా చెప్పే జగన్ లాంటి సీఎంను చరిత్రలో ఎప్పుడూ చూడలేదన్నారు.

తేడాను మీరే గుర్తించండి

చీపురుపల్లి నియోజకవర్గంలో తనతో పాటు చాలా మంది ఎమ్మెల్యే పదవి చేపట్టారని, అయితే అభివృద్ధి విషయంలో తేడాను గుర్తించాలని కోరారు. తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్న హయాంలో నియోజ కవర్గంలో అభివృద్ధి జరిగిందా లేక ఏదైనా అవినీతి జరిగిందా అన్నది ప్రజలు గుర్తించాలన్నారు. ఎలాంటి తప్పు చేయకుండా ప్రజలకు సేవలు అందించామని అందుకే ధైర్యంగా ఓటు అడగగలుగుతున్నామన్నారు. త్వరలో చీపురుపల్లిలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో చాలా మంది ప్రతిపక్ష నాయకులు నోటికి వచ్చిన ట్లు మాట్లా డుతున్నారని, నియోజకవర్గానికి వారేం చేశారో ప్రజలకు చెప్పాలన్నారు.అనంతరం ఆసరా నాలుగో విడతలో భాగంగా మండలంలోని 1,347 స్వయం సహాయక సంఘాలకు రూ.11.5 కోట్లు నమూనా చెక్‌ను మంత్రి అందజేశారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎంఎల్‌సీ ఇందుకూరి రఘురాజు, ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష,డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, ఆర్డీఓ బి.శాంతి, తహసీల్దార్ ఎం.సురేష్, ఎంపీడీఓ జి.గిరిబాల, వెలుగు ఏసీ బంగారమ్మ, ఏపీఎం ఎం.వి.రాజశేఖర్, ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొత్స సందీప్, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైస్ ఎంపీపీలు కరిమజ్జి రమణమ్మ, పతివాడ లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, నాయకులు పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, పాల్గొన్నారు.

తోడేళ్ల మాదిరిగా ఒక్కటై వస్తున్నారు

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సూర్యుడు ఉదయిస్తే పగలు వచ్చినట్లు, చంద్రుడు వస్తే రాత్రి అయినట్లు టీడీపీ నాయకులు బయటకొస్తే ఎన్నికలు వచ్చినట్టేనని ప్రజలు చర్చించు కుంటున్నారని ఎద్దేవా చేశారు. కరోనా వంటి కష్టకాలంలో సైతం ప్రజలు ఎక్కడున్నారు, ఎలా ఉన్నారన్నది టీడీపీ నేతలకు తెలియదు కానీ ఎన్నికలు వచ్చేసరికి ఓట్ల కోసం తోడేళ్ల మాదిరిగా అంతా ఒక్కటై వస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో 600 హామీలు ఇచ్చి మరిచిపోయిన చంద్రబాబు మరోసారి ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు బయలుదేరాడన్నారు. ప్రజలు మంచి చేసిన ప్రభుత్వాన్ని గుర్తు పెట్టుకుని ఆశీర్వ దించాలన్నారు. చీపురుపల్లి పట్టణంలో ఇళ్లు లేని పేదలు ఉండకూడదనే రూ.20 కోట్లుతో భూమి కొనుగోలు చేసి వెయ్యి మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్లు మంజూరు చేశామన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మాయ మాటలు చెప్పడం చంద్రబాబుకు అలవాటే.

గత టీడీపీ ప్రభుత్వంలో దోపిడీ జరిగిందే తప్ప పేదలకు ఎలాంటి మేలు జరగలేదని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. అప్పటిలో లంచాలు ఇస్తే తప్ప పథకాలు అందేవి కావన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని, పేదల ఆర్థిక స్థితి మెరుగుపడిందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు గ్రామాల్లోనే అందుతున్నాయన్నారు. చంద్రబాబునాయుడు తన మనవడు మాత్రమే ఇంగ్లిష్ మీడియంలో చదవాలని అనుకున్నాడని, జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం రాష్ట్రంలో ప్రతీ పేద పిల్లాడు ఇంగ్లిష్ మీడియంలో చదువుకునేలా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను అమలు చేశారన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాయ మాటలు చెప్పడం చంద్రబాబునాయుడుకు అలవాటేనని అన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

ఆసరా సంబరాలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: మండలస్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలను ఈనెల 31వ తేదీన గజపతినగరం బైపాస్ రోడ్డులో పర్ణశాల వద్ద నిర్వహించను న్నామని, లబ్ధిదారులంతా హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండలంలోని ముఖ్యనేతలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు.సభకు హాజరయ్యే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు హాజరవుతారని చెప్పారు.

మెగాజాబ్ మేళా రేపు

విజయనగరం సీతం కాలేజీలో ఈనెల 31న జాబ్ మేళా నిర్వహించనున్నారని, నియోజకవర్గ నిరుద్యోగ యువత సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. విజయగరంతో పాటు విశాఖపట్నం, మన్యం, శ్రీకాకుళం,అనకాపల్లి,అల్లూరి సీతారామరాజు జిల్లాల నిరుద్యోగ యువత కోసం ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నానరని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వి.ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, సీనియర్ నేతలు మండల సురేష్, ఎం.నరశింగరావు, కె.సుబ్రహ్మణ్యం, పి.నారాయణమూర్తి, పి.గురునాయుడు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

వేపాడ: నీలకంఠరాజపురంలో ఏపీ కొప్పుల వెలమ సంక్షేమ సంఘం 2024 క్యాలెండర్‌ను డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకటచినరామునాయుడు సోమవారం ఆవిష్కరించారు. సంఘం నాయకులు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష

బొండపల్లి: భూయాజమాన్య హక్కుల చట్టం-2022ను రద్దు చేయాలని కోరుతూ గజపతినగరం ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ కోర్టు న్యాయవాదులు మండలంలోని బోడసింగిపేట జాతీయ రహదారి-26 పక్కన సోమవారం రిలే నిరాహార దీక్షలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బిట్రా సూర్యారావు మాట్లాడుతూ ఈ చట్టం వల్ల ప్రజల స్థిరాస్తులకు భద్రత ఉండదని, సంబంధిత కేసులను హైకోర్టులోనే పరిష్కరించుకోవాలన్న నిబంధనతో సామాన్యులకు ఇబ్బందులు తప్పవన్నారు. న్యాయవాదులు రమేష్ రాజు,తిరుపతిరావు,శ్రీనివాసులునాయుడు,రామునాయుడు,శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

దత్తిరాజేరు: మండలంలో 2019 నుంచి 2024 జనవరి వరకు వివిధ కారణాలతో నలుగురు రేషన్ డీలర్లు మృతిచెందారని, వారి కుటుంబాలకు రాష్ట్ర డీలర్ల సంఘం రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించిందని మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు పాలు అప్పారావు తెలిపారు. జిల్లా కేంద్రం విజయనగరంలోని రెవెన్యూ హోమ్‌లో సో మవారం డీలర్ల సంఘ సమావేశం నిర్వహించారు.ఈసమావేశంలో కోమటిపల్లి, వంగర, ఎం.లింగాలవలస, భోజరాజపురం గ్రామాలకు చెందిన డీలర్లు ఈశ్వరరావు ,దత్త అ ప్పలనాయుడు, రామ్మూర్తి, చిన్నంనాయుడు కుటుంబాలకు జిల్లా డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు నగదు అందజేశారని అప్పారావు చెప్పారు.

మెరకముడిదాం: మండలంలో ఇటీవల మృతిచెందిన ఆరుగురు రేషన్ డీలర్ల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున రాష్ట్ర డీలర్ల సంఘం అందజేసిందని మండల డీలర్ల సంఘం సభ్యులు తెలిపారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కుమారస్వామి

శృంగవరపుకోట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విశాఖపట్నం సీఐడీ డీఎస్పీ కుమారస్వామి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీలకు పీఓఏ యాక్ట్‌పై సోమవారం ఒక్కరోజు అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన డీఎస్పీ కుమారస్వామి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు సామాజిక, ఆర్థికం రంగాల్లో సమాన అవకాశాలు పొందేందుకు, సామాజిక న్యాయం అందించేందుకు, ఈచట్టాన్ని రూపొందించారని చెప్పారు. ఎస్టీ, ఎస్టీల న్యాయపరమైన హక్కులకు భంగం కలిగించడం, అసత్య నేరారోపణలు, అక్రమ కేసులు బనాయించడం, ఇరికించడం వంటివి నేరాలుగా పరిగణిస్తారన్నారు. చట్టంలో లోటుపాట్లును సరిచేసి మరింత మరింత పటిష్టంగా అమలు చేసేందుకు పలు సవరణలు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలు సరైన ఆధారాలతో కేసులు నమోదు చేస్తే నిలుస్తాయని, ఇష్టానుసారం కేసులు పెడితే విచారణలో వీగిపోతాయన్నారు. ఎస్సీ నాయకులు కె.జయశంకర్, గణేష్ మాట్లాడుతూ అధికారుల తీరుతో అట్రాసిటీ చట్టం నీరుగారుతోందని ఆరోపించారు. కేసుల విచారణలో జాప్యమవుతోందని కేత వీరన్న చెప్పారు. ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



కొత్తవలస: ఈవీఎంలో ఓటు వేసే విధానంపై ఉత్తరాపల్లిలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొత్తవలస: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం)పై ప్రజలకు అపోహలు తొలగించేం దుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని ఉత్తరాపల్లి, గాంధీనగర్, చిన్ని పాలెం,నిమ్మలపాలెం గ్రామాల్లో ఓటర్లకు తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర ఆధ్వర్యంలో ఈవీఎంలో ఓటు వినియోగించుకునే విధానంపై సోమ వారం అవగాహన కల్పించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేశారు.ఆర్ఐ రాజేష్, పలువురు వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

గుర్లలో..

గుర్ల: ఈవీఎంలో ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై ఓటర్లకు అవగాహన అవసరమని తహసీల్దార్ పద్మావతి అన్నారు. స్థాని క తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈవీఎం, వీవీప్యాట్ పనితీరును వివరించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: ఇల్లు లేని పేదలు కోసం ప్రభుత్వం భూములు కొనుగోలు చేసి ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. పట్టణంలోని వంగపల్లిపేట గ్రామ సచివాలయం వద్ద సోమవారం 41 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు తక్షణమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

జనాభా వివరాలు సిద్ధం చేయాలి

వలంటీర్లు తమ పరిధిలో ఉన్న కుటుంబాలకు సంబంధించిన జనాభా వివరాలు సేకరించాలని మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు.ఈ ప్రక్రియను పర్య వేక్షించాలని ఎంపీడీఓ, డీఎల్‌డీఓలకు సూచించారు. ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొత్స సందీప్, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్ధనరావు, ఆర్డీఓ బి.శాంతి, తహసీల్దార్ ఎం.సురేష్, ఎంపీడీఓ జి.గిరిబాల, డీఎల్‌డీఓ లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, గిరడ రాందాసు, ఇప్పిలి తిరుమల, మంగళగిరి శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభం



హెల్త్ వెల్‌నెస్ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీ పరిధి వంగపల్లిపేట గ్రామంలోని సచివాలయం-3 పరిధిలో రూ.24.8 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం , రూ.20.8 లక్షలతో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ కేంద్రం భవనాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొత్స సంధీప్, వైఎస్సార్ సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, గిరడ రాందాసు, మంగళగిరి శ్రీను, ముల్లు పైడిరాజు, ఇప్పిలి తిరుమల, కింతలి మధు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి భూమిపూజ



రాయుడిపేటలో భూమి పూజ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

వేపాడ: మండలంలోని వీలుపర్తి పంచాయతీలోని నాలుగు గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల ట్యాంకుల నిర్మా ణాలకు ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు సోమవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా డీఈఈ కె.ఆర్.వి.పైడిరాజు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.1.67 కోట్లతో ఈ ట్యాంకులు నిర్మించను న్నామని చెప్పారు. రాయుడుపేట, బొర్రవలసలో ఒక్కో ట్యాంకు 10 వేల లీటర్ల సామర్థ్యంతో రెండు ట్యాంకులు, కొలికిపాలెం,చినదుంగాడలో 15 వేల లీటర్ల సామర్థ్యంతో రెండు ట్యాంకులు నిర్మిస్తామని తెలిపారు. ఎంపీపీ సత్యవంతుడు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ దేవీ,కామేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన



గుర్ల: విజేతలతో జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకులు

గుర్ల: 'ఆడుదాం- ఆంధ్రా' చీపురుపల్లి నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన మండల క్రీడాకారులకు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణ రాజు, పొట్నూరు సన్యాసినాయుడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అభినందించారు. పురుషుల కబడ్డీ పోటీల్లో మండలానికి చెందిన చింతలపేట జట్టు, మహిళల ఖోఖో పోటీల్లో కెల్ల జట్లు ప్రథమ స్థానంలో నిలవగా, పురుషుల క్రికెట్‌లో గుర్ల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎంపీడీఓ కల్యాణి, ఎంఈఓ భానుప్రకాష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సత్తాచాటిన మోడల్ స్కూల్ విద్యార్థినులు

దత్తిరాజేరు: 'ఆడుదాం-ఆంధ్రా' గజపతినగరం నియోజకవర్గస్థాయి బాలికల క్రికెట్ పోటీల్లో మండలంలోని షికారుగంజి మోడల్ స్కూల్ జట్టు విజేతగా నిలిచిందని ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి సోమవారం తెలిపారు. విద్యార్థినులను ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

గజపతినగరం: గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 'ఆడుదాం- ఆంధ్రా' పేరుతో ఆటల పోటీలు నిర్వహిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు అన్నారు. గజపతినగరం నియోజకవర్గ స్థాయి పురుషుల క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన మండల జట్టును మండల కేంద్రంలో సోమవారం ఆయన అభినందించారు. పీఈటీలు పాల్గొన్నారు.

పాన్ షాపు దగ్ధం

మెంటాడ(గజపతినగరం రూరల్): గజపతినగరం మండలం, ముచ్చర్ల గ్రామంలో ఆదివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో బీసీ కాలనీ వాసి సర్ధిరాజుకు చెందిన పాన్‌షాపు దగ్ధమైందని అగ్నిమాపకశాఖ అధికారి మురళీ సోమవారం తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని, షాప్‌లో సుమారు రూ.30వేల విలువైన సామగ్రి కాలిబూడిదైనట్లు గుర్తించామన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చామని, అయితే అప్పటికే సగానికి పైగా షాపు దగ్ధమై పోయిందని పేర్కొన్నారు.

ఆక్రమణల గుర్తింపు

గజపతినగరం: మండల కేంద్రంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి షెడ్‌లు వేసేందుకు సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ అరుణకుమారి ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించాలని ఆర్ఐ సీహెచ్.సుమ, వీఆర్‌ఓ రామకృష్ణను సోమవారం ఆదేశించారు. ఆర్ఐ, వీఆర్‌ఓతో పాటు ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర అక్కడికి చేరుకుని ఆక్రమణలను గుర్తించారు. వారు ఆక్రమణదారులతో మాట్లాడి తక్షణమే ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చేయాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.